క్లుప్తంగా

వేడుకగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



మాచర్ల: పట్టణంలో బస్టాండ్ వెనుక ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బోయ రామిరెడ్డి, బండ్ల వెంకటేశ్వర్లు, పోలిశెట్టి పిచ్చయ్య, కజ్జం గురవయ్య, కొత్తమాసు బ్రహ్మారావు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రభు మార్గాన్ని అనుసరించాలి

మాచర్ల: పట్టణంలోని బాప్టిస్టు చర్చిలో ఆదివారం పాస్టర్ రవికుమార్ ప్రత్యేక కూడిక నిర్వహించారు. నాలుగేళ్ల క్రితం చర్చి పాస్టర్ సీహెచ్ కోటయ్య మృతి చెందారని, ఆయన జ్ఞాపకార్థం ఈ నెల 17న ప్రత్యేక ప్రార్థనలు, కూడిక జరుగుతుందని చెప్పారు. భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

19 నుంచి క్రీస్తు సువార్త కూటములు

మాచర్ల: పట్టణంలో లెమన్స్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో మిస్సమ్మ హాస్పిటల్ కాంపౌండ్‌లో మూడు రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు బ్రదర్ ప్రభాకర్‌రావు ఆదివారం తెలిపారు. ఉదయం, సాయంత్రం క్రీస్తు సువార్త కూటముల్లో గుంటూరుకు చెందిన పీటర్‌పాల్, చైన్నెకు చెందిన జాన్ హైడ్, బాపట్లకు చెందిన రత్నం పాల్గొని ప్రత్యేక సందేశాలిస్తారని తెలిపారు. కూటముల వివరాల కోసం 98842 04888కు సంప్రదించాలన్నారు.

బీజేపీని బలోపేతం చేయండి



మాచర్ల: భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేసి, సభ్యత్వాలు విస్తృతంగా చేపట్టాలని జిల్లా ప్రముఖులు పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం నెహ్రూ నగర్, కల్యాణ మండపం వద్ద సమావేశం నిర్వహించారు. జిల్లా కో–ఆప్షన్ మెంబర్ మస్తాన్‌రావు, గుమ్మడి నాసరయ్య, పోకూరి కాశీపతి మాట్లాడుతూ బీజేపీ బలపడేలా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పిలుపు మేరకు పనిచేస్తామన్నారు. పట్టణ మాజీ అధ్యక్షులు కాసూరి శ్రీనివాసులు, ప్రధానకార్యదర్శి ఏచూరి సురేష్‌బాబు, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాంబాబు, అధ్యక్షులు మారం వంశి, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, రామారావు, బొడ్డుపల్లి ఈశ్వరయ్య తదితరులున్నారు.

వరద బాధితులకు సాయం

నరసరావుపేట: విజయవాడ వరదలలో సర్వం కోల్పోయిన పేదవారికి సహాయం అందించేందుకు స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. ఆదివారం ఐదో వార్డు నాయకులు కందుల ఎఱ్ఱా దుప్పట్లు, చీరలు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ప్రతి ఒక్కరూ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని, వారి కష్టాల్లో పాలు పంచుకోవాలని డాక్టర్ గోపిరెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు స్పందిస్తున్నాయి. స్వచ్ఛందంగా ముందు వస్తున్నారు.

ధననాథుడు



రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలోని శ్రీ గంగాపార్వతీ సమేత వల్లభేశ్వరి స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకుని మట్టి విగ్రహానికి ఆదివారం తొమ్మిదో రోజు పూజలు నిర్వహించారు. స్వామిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. 11 రోజుల పాటు పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహానికి నిమజ్జనోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే వి.రెడ్డిపాలెం గ్రామంలో వినాయకుని దేవాలయంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి పూజలు నిర్వహించిన అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

చిలకలూరిపేట: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) స్వర్ణోత్సవాలలో భాగంగా నియోజకవర్గ స్థాయి ఉపాధ్యాయ క్రీడా సంబరాలు పట్టణంలోని సాదినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటీలను స్కూల్ డైరెక్టర్ ప్రభాకరరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. షాట్‌పుట్, రన్నింగ్, క్యారమ్స్, చెస్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. షేక్ అచ్చే మియా, ఖాదర్‌మస్తాన్, ఇస్మాయిల్, నాగరాజు, నాగమణి,రాజు న్యాయనిర్ణేతలు వ్యవహరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.తిరుపతిస్వామి, నాయకులు టి.సుధాకర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

బైబై గణేశా..!



లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న భక్తుడు



లడ్డూ ప్రసాదాన్ని రూ.1.10 లక్షలకు దక్కించుకున్న యెనుముల కేశవరెడ్డి దంపతులు



వినాయకుని ఊరేగింపులో పాల్గొన్న ఆర్యవైశ్యులు

మాచర్ల: వినాయక చవితి 9వ రోజు నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమానికి వాహనాల్లో జై గణేశా జైజై గణేశా అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపు చేశారు. గులాంలు చల్లుకుంటూ, డీజేలు పెట్టి నెహ్రూ నగర్ నుంచి రింగురోడ్డు వరకు విగ్రహాల ప్రదర్శన నిర్వహించారు. ఒకే రోజు 50 విగ్రహాలు నిమజ్జనానికి భక్తులు పోటా పోటీగా తరలించారు.

పోటాపోటీగా లడ్డూ ప్రసాదాల వేలం

మాచర్ల: పట్టణంలోని పలు వినాయక మండపాల్లో లడ్డూ ప్రసాద వేలం ఆదివారం ఘనంగా జరిగింది.

హేమ శ్రీ అపార్ట్‌మెంట్‌లో యెనుముల కేశవరెడ్డి రూ.1.10 లక్షలకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. నెహ్రూ నగర్‌లో వాటర్ ప్లాంట్ వద్ద మండపంలోని లడ్డూను హైటెక్ వీరారెడ్డి రూ.50,116కు, 7వ వార్డులోని జననీ అపార్ట్‌మెంట్‌లో లడ్డూను ఇన్నారెడ్డి రూ.40 వేలకు దక్కించుకున్నారు.



బస్టాండ్ సమీపంలో వినాయకుడి తరలింపు



రామాటాకీస్ వీధిలో రంగుల చల్లుకుంటూ ఉత్సాహంగా ఊరేగింపు



వినాయకుని నిమజ్జనం సందర్భంగా నృత్యాలు చేస్తున్న మహిళలు



మాచర్లలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

మాచర్ల రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు ఆదివారం తహసీల్దార్ ఎండీ జియా వుల్ హక్ సోమవారం తెలిపారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం సెలవు ప్రకటించిందన్నారు.

రేపు విశ్వకర్మ విశ్వశాంతి జయంతి

మాచర్ల: పట్టణంలోని పాత మాచర్లలో జ్యూయలర్స్ యజమానులు విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా విశ్వకర్మ విశ్వశాంతి జయంతి నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కటకం నాగేశ్వరరావు, కార్యదర్శి తాళ్లూరి మోహన్ బాబు ఆదివారం తెలిపారు. ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి సాయంత్రం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

అన్నదానం

మాచర్ల: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఎస్ఎం కేసీ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు. ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలోనూ ట్రస్ట్ నిర్వాహకులు వేముల మాధవి, కన్వీనర్ టి.సాంబశివరావు, స్వర్గీయ వేముల సుబ్బారావు, వేముల ప్రేమ్ మణి కుమార్, వేముల కిరణ్‌ల జ్ఞాపకార్థం అన్నదానం చేశారు.

మహాత్మా గాంధీ విగ్రహావిష్కరణ



గాంధీ కాంస్య విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, ఎమ్మెల్సీ జంగా

గురజాల: శాంతి అనే ఆయుధంతో బ్రిటిష్ వారిపై పోరాటం చేసిన వ్యక్తి మహాత్మా గాంధీ అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో మహాత్మా గాంధీ కాంస్య విగ్రహావిష్కరణ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి యువకుడు గాంధీజీ చూపించిన మార్గంలో నడవాలన్నారు. జాతిపితను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో నడవాలన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం, శ్రీదేవి రైసు మిల్లు, రెడ్డి బండ్ల సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక స్వామి మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, శరమాళ్ల హనుమంతురావు, పి.కాంతరావు, ఎల్.బుల్లయ్య, కౌన్సిలర్ చాంగటి శ్రీను, చింతకాయల దానయ్య, షేక్ నజీమూన్, ఆర్యవైశ్య సంఘం, కూటమి నాయకులు తదితరులున్నారు.

ముమ్మరంగా వరి నాట్లు



వరి నారు పీకి కట్టలు కడుతున్న మహిళలు



వరి నారు కట్టలను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న రైతులు

పిడుగురాళ్ల: వర్షాలు అనుకూలంగా కురవడంతో వరి నాట్లను రైతులు ముమ్మరం చేశారు. గతేడాది కంటే ఈ ఏడాది వరి సాగుకు రైతులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. కట్ట రూ.80 చొప్పున వరి నారును రైతులు కొనుగోలు చేసి, మాగాణిలో నాటుతున్నారు.

సభ్యత్వ నమోదుతోనే బీజేపీ బలోపేతం



సభ్యత్వ నమోదులో బీజేపీ నాయకులు

రెంటచింతల: ప్రతి గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు చేయడం ద్వారానే బీజేపీ బలోపేతం అవుతుందని ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం రెంటచింతలలో మండల పార్టీ అధ్యక్షుడు సూరపరెడ్డి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సంస్థాగత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో పురోగాభివృద్ధి చెందుతుందనే విషయాన్ని గ్రామీణ ప్రాంతాల ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి కూనిశెట్టి వెంకటేశ్వర్లు, మాచర్ల నియోజకవర్గ కన్వీనర్ జి.నాసరయ్య, జిల్లా కార్యదర్శి పోలిశెట్టి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, పార్టీ కో–కన్వీనర్ కాశీపతి, మండల ప్రధాన కార్యదర్శి వరప్రసాదరావు పాల్గొన్నారు.

యువ ఇంజినీర్లకు స్ఫూర్తి మోక్షగుండం



చిలకలూరిపేట: యువ ఇంజినీర్లకు స్ఫూర్తి ప్రదాత మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని లైసెన్స్‌డ్ సర్వేయర్స్ అండ్ ఇంజినీర్స్ అసోసియేషన్ సభ్యులు కొనియాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్‌డేను ఆదివారం నిర్వహించారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అనేక ప్రాజెక్టుల నిర్మాణంలోనూ, పరిశ్రమల స్థాపనలోనూ ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. యువ ఇంజినీర్లు విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకొని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్యామ్, జబ్బార్, చంద్రా, శ్రీనివాస్, మధు, భానుప్రసాద్, సాదిక్, షరీఫ్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

నరసరావుపేట: పట్టణంలోని మోర్ సెంటర్‌లో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వీరమళ్ళ వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నేషనల్ కౌన్సిల్ మెంబర్ వల్లెపు కృపారావు, జిల్లా సంయోజక్ చిరుమామిళ్ళ ఆదినారాయణ రావు, పట్టణ సభ్యత్వ ప్రముఖ్ అన్నపురెడ్డి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. పట్టణంలోని ప్రముఖ వైద్యులు రాఘవేంద్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ అనిరుధ్ ఫణి భార్గవ్ పార్టీ శ్రేణుల సమక్షంలో కృపారావు చేతుల మీదుగా సభ్యత్వం అందుకుని, పార్టీలో చేరడం పట్ల తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

నాయకులు గుడిపల్లి కృష్ణమోహన్, కాటా అంజనారెడ్డి, మేడికొండ సత్యానందబాబు, ఎం.కబ్బిరెడ్డి, మైలవరపు సుబ్బారావు, అమ్మ జిలానీ, రాజనాల వెంకట రాజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం



అవార్డును అందుకుంటున్న హెచ్‌ఎం దుర్గాభవాని

విజయపురిసౌత్: మాచర్ల మండలం ఎత్తిపోతలలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం జి.దుర్గాభవానికి జాతీయ పురస్కారం లభించింది. తిరుపతిలో కలాం విజన్, యువతేజం ట్రస్టు ఆధ్వర్యంలో విశ్వం కళాశాలలో ఆచార్య దేవో భవ జాతీయ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ పురస్కారాలకు దుర్గాభవానితో పాటు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు ఆర్.నాగమల్లేశ్వరి ఎంపికయ్యారు. అవార్డులను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనువడు డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ, ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ వీసీ కనకాల రత్తయ్య, యువ తేజం చైర్మన్ కరీముల్లా ప్రదానం చేశారు.

వాసవీ మాత ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు



వాసవి కన్యకాపరమేశ్వరి

రెంటచింతల: కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభించినట్లు దేవస్థానం చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం దేవస్థానంలో విలేకర్ల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. పార్వతీదేవి అంశలో జన్మించిన ఆర్య వైశ్యల ఇలవేల్పు శ్రీ వాసవి అమ్మవారి దసరా నవరాత్రుల ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. 3న బాల త్రిపురసుందరీ దేవి, 4న ధనలక్ష్మీ దేవి, 5న గాయత్రీ దేవి, 6న అన్నపూర్ణదేవి, 7న సంతానలక్ష్మీ దేవి, 8న శ్రీ లలితా పరమేశ్వరి దేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషసుర మర్దిని దేవి, విజయదశమి రోజు 12న రజత కవచదారిణీదేవి అలంకారంలో భక్తులకు దర్శమిస్తారని తెలిపారు. విజయ దశమి పండగ రోజు భక్తులకు అన్న సంతర్పణ ఉంటుందని చెప్పారు.

చిన్నారుల విద్యపై జాగ్రత్తలు తీసుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వనమా పూర్ణచంద్రరావు

అమరావతి: ఆధునిక ప్రపంచంలో విద్యా వ్యవస్థలో పెనుమార్పులు సంభవిస్తున్నాయని, చిన్నారుల విద్య పట్ల ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలని గుంటూరు విభాగ్ అధ్యక్షుడు వనమా పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిరంలో గుంటూరు విభాగ్ ఫౌండేషన్ లెవెల్ టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం రెండవ రోజు ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ప్రధానాచార్యులు కోలా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ చిన్నారులకు పంచకోశాత్మక వికాసాలు కలిగే విధంగా విద్యా విధానం ఉండాలని అకాంక్షించారు. ఈ సందర్భంగా పూర్వ ప్రధాన ఆచార్యులు సోమిశెట్టి శివపార్వతి మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే నైపుణ్యం, సృజనాత్మకత కలిగించే విధంగా విద్యా విధానం కొనసాగాలని అందుకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అమరేశ్వరాలయ ఈఓ వేమూరి గోపి విశ్వనాథ శర్మ, పాఠశాల సభ్యులు శనగవరపు రామ్మోహన్ శర్మ, పులిపాటి పవన్ కుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని శిశుమందిర్ ఆచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



చిన మసీదు వీధిలో ప్రార్థనలకు హాజరైన ముస్లిం కుటుంబాలు

చిలకలూరిపేటటౌన్: సమాజంలో దురాచారాలను పెకలించి.. మానవాళిని సన్మార్గం వైపు నడిపించిన మొహమ్మద్ ప్రవక్త బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయమని ముఫ్తీ మొహమ్మద్ అబ్దుల్ కలీం చెప్పారు. మండలంలోని పసుమర్రు గ్రామంలోని చినమసీదు బజారులోని ఆదివారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెండా చెట్టు వద్ద ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో ఆయన పాల్గొని మొహమ్మద్ ప్రవక్త(సఅసం) జన్మదినాన్ని ఈ మాసమంతా ముస్లింలు వాడవాడలా ఎంతో ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. చినమసీదు వీధిలోని ముస్లిం కుటుంబాలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు సమష్టిగా చేయడం అభినందనీయం అన్నారు. మౌలానా బాజీ, సుల్తాన్ దువా చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలను షేక్ మస్తాన్‌షరీఫ్–నసీమా, అబ్దుల్‌రవుఫ్–గౌసియా, అబ్దుల్‌రవుఫ్–మెహెర్, ఫర్మానుల్లా–సానియా, సమీర్, ఖాదర్‌మస్తాన్ పర్యవేక్షించారు.

హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష వద్దు



చిలకలూరిపేటటౌన్: హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితులపై వివక్షత చూపడం తగదని క్యాంపు స్వచ్ఛంద సంస్థ కౌన్సిలర్ కాకుమాను హనుమంతరావు చెప్పారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు 'మీకు తెలుసా?' హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అవగాహన సదస్సు గణపవరం ధనలక్ష్మి మిల్లులో నిర్వహించారు. మిల్లులోని ఒడిశా, శ్రీకాకుళం, విజయనగరం కార్మికులు, రాగన్నపాలెం రిస్క్‌గ్రూపు సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో క్యాంపు ప్రాజెక్టు మేనేజర్ ఐ.రోహిణి, ఆశ వర్కర్లు శామీమ్, లక్ష్మి, పెద్దబ్బాయ్ పాల్గొన్నారు.

సమస్యల గురుకులం

- కొత్తగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నో యూనిఫాం
- 564 మంది విద్యార్థులకు 40 మరుగుదొడ్లు
- గత ప్రభుత్వ నిధులతో కొంతమేర మరమ్మతులు




తలుపులేని మరుగుదొడ్లు

అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థుల చదువులు సమస్యల మధ్య కొనసాగుతున్నాయి. నూతనంగా అడ్మిషన్ పొందిన 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులతో పాటు, ఖాళీల భర్తీల్లో సీట్లు పొందిన విద్యార్థులకు యూనిఫాం ఇంతవరకు అందలేదు. గత ప్రభుత్వం ఏటా జూన్‌లోనే విద్యార్థులందరికీ మూడు జతల చొప్పున యూనిఫాం దుస్తులు ఇవ్వడం జరిగింది. కుట్టు కూలి కూడా ఇచ్చేవారు. పాఠశాల తెరిచి మూడు నెలలు కావస్తోంది. కానీ, ఈ ఏడాది ఇంత వరకు కొత్తగా చేరిన విద్యార్థులకు యూనిఫాం ఇవ్వలేదు.

మరుగుదొడ్ల కొరత

పాఠశాలలో 564 మంది విద్యార్థులున్నారు. కనీసం 60 నుంచి 70వరకు మరుగు దొడ్లు మరో 70 స్నానాల గదులు ఉంటేగాని సరిపోవు. కాని తాత్కాలికంగా నిర్మించిన మరుగుదొడ్లతో కలిపి ప్రస్తుతం 40 మాత్రమే ఉన్నాయి. 5 నుంచి 10వరకు 452 మంది, 102 మంది ఇంటర్మీడియెట్ విద్యార్థులున్నారు.



కిటికీలు లేని పడక గదులు

స్కూల్ మానిటరింగ్ ఫండ్‌తోనే మరమ్మతులు

స్కూల్ మానిటరింగ్ ఫండ్ కింద గత ప్రభుత్వం రూ.6.68 లక్షల నిధులు మంజూరు చేసింది. అందులో రూ.4 లక్షలతో పాఠశాలలో విరిగిన కొన్ని కిటీలు, మరుగు దొడ్లకు సీట్లు, తలుపులు ఏర్పాటు చేశారు. డార్మిటరీలో కిటికీలు ఫ్రేమ్‌లతో సహా పూర్తిగా విరిగిపోయాయి. కొంత మొత్తం వాటి మరమ్మతులకు వినియోగించినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. మరో రూ.2.68 లక్షల ఫండ్ నూతనంగా ఏర్పడిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో వినియోగించాల్సి ఉంది. విద్యార్థుల పడక గదులు అధ్వానంగా ఉన్నాయి. కిటికీలకు ఊచలు ఊడిపోవడంతో కోతులు లోనికి ప్రవేశిస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు.

ఉద్యమాల వేగు చుక్క ఏచూరి

పెదకూరపాడు: ఉద్యమాల వేగు చుక్క సీతారం ఏచూరి అని క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ బెల్లం కొండ రామగోపాలరావు అన్నారు. పెదకూరపాడులో సీపీఎం ఆధ్వర్యంలో సీతారం ఏచూరి చిత్రపటానికి ఆదివారం నివాళులర్పించారు. జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి శేషారావు, కాల్వ అప్పా రావు, గుప్తా వెంకటేశ్వర్లు, మలినేని నరసింహారావు, రామనాథం, సాంబ శివ రావు పాల్గొన్నారు.

